

# విశాలాక్షి

రచన:

**శ్రీ భమిడిపాటి వెంకటరమణ**

ప్రతి వేసవిలోనూ మామిడి పిందెలు కాస్తాయి. నాకు విశాలాక్షి జ్ఞాపకాని కొస్తుంది. విశాలాక్షి విశాలమైన కళ్లుగల విశాలాక్షి. పదకొండేళ్లయినా నిండని అంత చిన్నపిల్లా తన చిటికిన వ్రేలుతో నన్ను నా ఆశల్లోంచి ఆశయాల్లోంచి, ఆదర్శాల్లోంచి ప్రేమల్లోంచి, ఆనందతరంగాల్లోంచి తేలించి కొనిపోయిన దేవతవలె అనిపించింది. తన విశాలమయిన నయనాల్లో నన్ను ఉయ్యాలలూగించింది. యధార్థమైన అనుభవాలే స్మృతులుగానూ, స్మృతులే ఈగతి కథలుగానూ మారిపోతాయని నేను ఎన్నడూ అనుకోలేదు.

విశాలాక్షిపేరు విన్నా కొత్తమామిడి పిందెల తావులుగన్నా ఆకుల మరుగున దాగివున్న మామిడిపిందెలవలె కొద్ది కొద్దిగా కనబడ్తూ చవులూరించే అనుభవాలు తెరలు తెరలుగా విడుతూ నా కళ్ళ ఎదుట ప్రత్యక్ష మవుతాయి. వాటిల్లో ఇప్పుడేవో కొత్తఅర్థాలు. గోచరిస్తాయి నూత్న సత్యాలు వినవస్తాయి. కాలం అనుభవాలకి యవ్వనాన్ని తొడిగి ఎంతటి మనోహరత్వం చేకూరుస్తుంది? గత కాలపు స్మృతులు, అవి ఎంతటి బాధకరమైనవి అయినా సముద్రపు అలలవలె హాయిగా స్నానం చేయించి పోతాయి. ఆ స్మృతులలో ఎంతో గాఢమైన మధురిమ ఉంటుంది.

ఒక ఏడాదిగా ఆ కొండమీద మేడగదిలో ఉంటున్న నాకు పరిచయస్థులు ఒకరూ లేరు. మేడయింటికి తగిలి మూడు నాలుగు ఇళ్ళవాళ్లు దిగువున ఉంటున్నారు. కాని ఎవరికీ నే నెవరో తెలుసుకోవాలనే కుతూహలం ఉన్నట్టు కనబడలేదు. నాకు కుతూహలం ఉన్నప్పటికీ తీరిక లేదు. బహుశా వాళ్ళ సంగతీ అంతే నేమో!

ఉన్నట్టుండి నా గది గుమ్మంలో ఒకనాడు ఒక హంస వాలింది. దిగువనున్న అరవవాళ్ల పిల్ల నాలుగేళ్లది – నెమ్మదిగా మెట్లెక్కి నాగది గుమ్మందగ్గర కొచ్చింది. అప్పుడే వికసించిన పద్మమువలె పరిశుభ్ర-

మైన ఆ ముఖంమీద మంచుబిందువులవలె నిర్మలమైన మందహాసం వర్షిస్తూ నన్ను చూస్తూ నిలుచుంది. ఆ అమ్మాయిపేరు పద్మ. వచ్చీరాని తెలుగు మాటలతో అరవ యాస చేరుస్తూ నన్ను తన స్నేహితుల్లో చేర్చుకునేందుకి అభ్యంతరం ఏమీ లేదని ఎలాగో తెలియపరచింది. అయితే ఒక షరతుమీద. నేను తనేమి కోరినా తెచ్చి ఇస్తూండాలి. పళ్లు, పిప్పరమెంట్లు, రిబ్బన్లు, జోళ్లు, ఆటబొమ్మలు మొదలైనవి. నేను ఆ చిన్న స్నేహాన్ని సులువుగా నే కొనుక్కోగలిగేను. పద్మావతి వచ్చిపోవడం చూసి చుట్టుపక్కల నున్న 'లేడిపిల్లలు' 'నెమళ్లు' కూడా భయంలేకుండా నా ఆశ్రమవాకిట సంచరించడం సాగించాయి. కొన్నికొన్ని నన్నుచూసి భయపడి పరుగెత్తేవి. మరి కొన్ని కేకలు వేసి గోలచేసేవి.

ఒకనాడు ఈ పసిపిట్టలలో నెమలివలె కంఠం ఆడించుకుంటూ లేడివలె కళ్లు తిప్పుకుంటూ కాస్త వయస్సులో పెద్దగా ఉండే పిల్ల వచ్చింది.

పిల్లలంతా 'విశాల' అని పిలుస్తున్నారు. విశాల! సువిశాలనేత్రాలు. విశాల హృదయంగల తల్లివలె ఆ పసిపిల్లలను "నాతో రండి! మీ కేం భయంలేదు. అందరం కలిసి అతనిదగ్గిరికి వెళదాం." అని నడిపించుకొని వస్తూంది. అంతమంది పిల్లలు పిట్టలులాగ ఒక్కమారు వచ్చి నాగది గుమ్మందగ్గర నిలబడి గోలచేస్తూవుంటే నా యింటికి ఏ దేవతలయినా స్వర్గంనుంచి దిగివచ్చారా అనిపించింది. పోయి చూశాను. పిల్లలు పారిపోలేదు. విశాలకు దగ్గరగా చేరి ఆ పిల్లను అంటిపెట్టుకొని ముఖాలు దాచుకొని దొంగచూపులు చూస్తున్నారు. నా యింటికి సనకసనందుల్లాగ ఇంతమంది అతిథులు ఒక్కసారిగా వచ్చారు. వీరందర్ని సంతృప్తిపరచడమే నా విధి. బత్తాయిపళ్లు, కమలాలు ఒలిచి వారందరికీ సమర్పించాను. అందరూ వికసిల్లిన ముఖాలతో చిన్నచిన్న చేతుల్ని చాపి పుచ్చుకున్నారు. విశాలకుకూడా ఇవ్వబోయాను, కళ్లతో నా చెయ్యిని ఆపింది.

"నా కక్కర్లేదు. మా నాన్నగారు నాకోసం ఎన్నో పళ్లు తెస్తారు. మీరు ఇస్తేనే మేము తినగలం, లేకపోతే లేదని మీరు గర్వపడక్కర్లేదు – రండర్రా పోదాం!" అని పిల్లల్నందర్నీ రైలులాగ మళ్లించుకొనిపోయింది. నా గుండెల్ని బరువయిన భావమేదో క్రుంగదీస్తోంది.

కొంతసేపయాక నాగది గుమ్మందగ్గర నిశ్శబ్దంగా నెమలివలె చప్పుడు చేస్తూ ఏదో తారాడుతున్నట్టు అనిపించింది. పోయి చూస్తే విశాలాక్షి. నన్ను చూసి పరుగెడ్తూంది.

"ఆగవమ్మా, భయంలేదు! ఒకసారి వచ్చేవా ఏరీ మిగతా పిల్లలందరూ?" అని పరుగెడ్తున్న ఆ పిల్లచేతులు పట్టుకొని



విశాలమైన ఆ కళ్ళలోకి చూస్తూ అడిగాను.

"ఇందాక మీరు నాకు ఇస్తానన్న బత్తాయిపండు తీసుకొనిపోదామని వచ్చాను. పిల్లలందరూ ఇళ్లకు వెళ్ళిపోయారు."

"అప్పుడు ఇస్తే వద్దన్నా వెందుకు"

"అందరితోపాటు ఇస్తే నా అధికం ఏమిటి ?"

"అందరితోనూ పుచ్చుకోకపోవడానికి నీ అధికం ఏంటి ?"

"ఏ ఎక్కువా లేకపోతే నాకు అక్కర్లేదు. మీ బత్తాయిపండు మీదగ్గరే ఉంచుకోండి!"

అని వెళ్లిపోబోతూంది.

"ఉండు విశాలాక్షీ! బత్తాయిపండు తెచ్చుకొని మరీ వెళ్ళు. ఇందాక నువ్వు పుచ్చుకోలేదని నే నెంత బాధపడ్డానో పులుసా ?"

"అందుకనే మళ్ళీ వచ్చాను. నిష్కారణంగా మిమ్మల్నెందుకు బాధపెట్టాలి అని."

పండు ఇస్తే అక్కడే నిలబడి ఒలుచుకొని తినడం ప్రారంభించింది.

"ఇంటికి వెళ్లి తినకూడదూ ?"

"మా నాన్నగారు చూస్తే తన్నరూ?"

"భయ మెందుకు ?"

"మీదగ్గర పుచ్చుకొన్నానని తెలుస్తే"

"నాదగ్గర పుచ్చుకున్న సంగతి చెప్పకు- మరి మీనాన్న నీకోసం ఎన్నో పళ్లు తెస్తుంటారుగా! వాటిలో ఇదొకటి!"

"ఉత్తదండి ఊరికనే అలాగ అన్నా!"

"ఏది ఉత్తది. నాన్నగారు పళ్లు తేవడమా ? నిన్ను తన్నడమా ?"

"రెండూనూ ?"

"అసాధ్యురాలవే! అబద్ధం ఆడి, అబద్ధం ఆడినట్టు ఒప్పుకుంటున్నావు!"

"మీదగ్గర అబద్ధాలు చెప్పకూడదు అనిపిస్తోంది."

"మంచిదానవే!"

"మీ రిచ్చిన పండు మీ ఎదుటనే తింటూంటే మీకు ఆనందంగా ఉంటుంది కదండీ!"

"అవును విశాలాక్షీ."

విశాలాక్షిపసిహృదయం పట్టుబడడం ఎంత సుళువు అయిందో దాన్ని అర్థం చేసుకోవడం అంత కష్టం అవుతోంది. పిల్లలతో కలిసి వచ్చినప్పుడు విశాలాక్షి నన్ను ఎంత అసహ్యించుకునేదో నేను చెప్పలేను. నా మీద తన కున్న కోపాన్నంతటినీ ప్రయోగిస్తుంది. నేను చేసే ఈ పనులు - పిల్లల్ని చేరదీయడం, వాళ్ళకు చిన్న చిన్న మేతలు వెయ్యడం ఎంత సబబు లేని పనో ఆలోచించమనేలా దెప్పిపొడుస్తుంది.

ఇలా చెయ్యడంలో నే నేదో ప్రతిఫలం వాంఛిస్తున్నట్టు, ఆ వాంఛించే ప్రతిఫలమే ఆ పిల్లలు నాకు ఇవ్వలేరన్నట్టు తెలియపరస్తూ నన్ను పిచ్చివాడికింద జమకట్టి నామీదకి పిల్లల్ని స్వారీ చెయ్యమని పంపించేది. కాని ఒక్కత్తే వచ్చినప్పుడు విశాల వేరు. తన విశాలమయిన నయనాల్లో ఒక్క నేను తప్పితే ఇంకొక్కరి ఛాయ ఉండకూడదన్నట్టుగా చూస్తుంది. ఒక్క తనకు తప్పితే ఇతరులు ఇంకెవ్వరికీ నా మేలు అక్కర్లేదు అన్నట్టుగా మాటాడుతుంది. అప్పుడే తనకోసం ఏమి ఇచ్చినా పుచ్చుకుంటుంది. పుచ్చుకున్నందుకు తన కృతజ్ఞత నంతటినీ ప్రకటిస్తూ నా క్షేమ సమాచారాల్ని గురించి ప్రశ్నిస్తుంది. ఒక్కొక్కప్పుడు నా అందాన్ని గురించి వర్ణిస్తుంది. ఒక్కొక్కప్పుడు నా వీపెక్కి స్వారీ చేస్తుంది. విశాల విశాలహృదయం నే నిప్పుడే తెలుసుకోగలుగుతున్నాను.

నిజంగా విశాల నా మనస్సుని ఆకర్షించింది. అంతే కాదు. విశ్వరూపం ధరించి నన్ను అన్నివైపులా తన ప్రేమపూరితమైన విశాల నయనాలతో బంధించివైచింది. విశాలను నే నెక్కుడుగా ప్రేమిస్తున్నట్టు మిగతా పసిపిల్లలు పసిగట్టారు.

వాళ్లలో వాళ్లు ఏమేమో కీచులాడుకున్నారు. పద్మావతి మాత్రం నా ముఖం ఎదుటనే అనేసింది. "మీకు మొట్టమొదట స్నేహితు లయింది ఎవరండీ? నేను గదా! మరి నన్ను వదలిపెట్టి ఆ విశాలకు అన్నీ తెచ్చిఇస్తారే? ఏమండీ మీ రిలా చేస్తారు!" అని సాగదీసింది నన్ను ఆ అరవపిల్ల. ఆ చిన్ననోటిలో పెద్దవాళ్ళమాటలు వినిపించాయి నాకు.

విశాల కోరినదే తడవు - పుస్తకాలు, కాగితాలు, పెన్సిళ్లు, రిబ్బన్లు, జోళ్లు, గౌనులు, ఆటబొమ్మలు, పువ్వులు, పళ్లు తక్షణం ప్రత్యక్ష మయేవి. ఈ విశాల నా సమయాలు ఎలా కనిపెట్టేదో, ఏ గోడ సందుల్లోంచి చూసేదో, ఏ కిటికీ కంతల్లోంచి చూసేదో ఎవ్వరూ ఎరగని వేళల్లో వచ్చి నాదగ్గరే ఉండేది నేనున్నంతసేపూ. ఎన్నో కబుర్లతో కుసుమవృష్టి కురిపించేది. సాయంకాలం నేను ఇంటికి రావడం కనిపెట్టి, సిల్కు గౌనుతో, రెండు జడలతో, కొత్త రిబ్బన్లతో, ఎత్తు మడమల జోళ్లతో ఏ గోడచివర్నో దాగిఉండి నేను ఇంటినుండి బయటికి వచ్చి షైరు బయలుదేరుదామనుకుంటే గభాలున వచ్చి చెయ్యిపట్టుకునేది. విశాలతోపాటు వచ్చిన మిగతా పిల్లలు సందుచివరదాకా వచ్చి పళ్లో పిప్పరమెంట్లో పుచ్చుకొని ఇళ్ళకు మళ్లేవారు. విశాలమాత్రం నా చెయ్యి వదిలేది కాదు!

సాయంకాలం సముద్రపుఒడ్డున కూర్చుని ప్రక్కన సముద్రంలా ఉన్న ప్రజనుకూడా లక్ష్యపెట్టక విశాల తన విశాలహృదయాన్ని వెలిబుచ్చేది. తన విశాల నయనాలతో తన ప్రశ్నలకు నే నిచ్చే జవాబులు వినేది. నా చుట్టూ చేరి నన్ను ప్రేమసముద్ర తరంగాల్లో ముంచి యెత్తేది. ఈ ఆనందమంతా సముద్రపు తరంగాలమీదినుంచి వొచ్చే బరువయిన గాలివల్లనో, లేక విశాలాక్షి మాటల ఆటల స్పర్ధలవల్ల హృదయంలో జనించే భావ తరంగాలవల్లనో నాకు తెలిసేది కాదు - ఇంత చక్కని సంధ్యాకాలం తన రాగాల్ని ఇంతలో మార్చుకుంటుంది. ఇంతలో అంధకారపు ఛాయలు అలుముకుంటాయి. చీకటిపడితే విశాలాక్షి క్షణం ఉండదు. ఇంటికి వెళ్ళిపోవాలి. నాన్నగారు ఏడుగంటలకల్లా ఇంటికి వస్తారు. వారు రాగానే కంటబడకపోతే తనకు చీవాట్లు తప్పవు.

విశాల నాన్నగార్ని నేను ఎరగను. ఆయన్ని నేను ఎప్పుడూ చూడలేదు. మాటాడలేదుకూడా. ఇన్నాళ్లుగా ఇంత పరిచయం ఉన్న విశాల నాన్నగార్ని నేను తెలుసుకోకపోవడం విచిత్రం! అప్పు


## చలనచిత్రాలకు

**నటుల ఎన్నిక**

మీరు ఎవరైనాసరే, అనుభవం కలిగిఉన్నా, లేకపోయినా - మా మరుసటి చిత్రంలో మీరొకపాత్ర ధరించవచ్చును - మీరు రు. 250 లు ధరావతుకట్టి (ధరావతు వాపసు చేయబడును) మూడు సంవత్సరాలవరకు అగ్రిమెంటు చేసుకోగలిగితే, మాఆఫీసులలో దేనినైనా స్వయంగా దర్శించవచ్చును.

**కో-ఆర్డినేటెడ్ సినీ ప్రొడెక్షన్స్,**

హెడ్డాఫీసు: 153, థామస్‌వీధి.

**ప్రొడక్షన్ సెంటర్:**

బర్‌కాట్ బంగళా, రామనాథపురం.

**కోయంబత్తూరు.**

**గమనింపు:** ఉత్తరము వ్రాయగోరువారు జవాబుకొరకు తమ అడ్రసు వ్రాసిన కవరు పంపగోరెదము.

డప్పుడు విశాల నాన్నగారంటే తనకుండే భయంఅమ్మ తనమీద చూపిస్తున్న అభిమానం చెప్పగా వినడమేకాని వార్ని ఇంతవరకు నేను చూడవలసిన అవసరం పడలేదు.

తలనొప్పిగా వుంటే మధ్యాహ్నం ఇంటికొచ్చి పడుకుందామనే ప్రయత్నంలో నే నుండగా ఎలా కనిపెట్టగలిగిందో విశాల నా గదిలోకి వచ్చింది. నే నిలా వేళకాని వేళల్లో ఇంటికిరావడం నెమ్మదిగా పడుకోబోవడం చూస్తే విశాలకిబాగాలేదు. నా తలనొప్పిని పోయేవరకు మాటలతో, గంతులతో, ఆటలతో తరిమికొట్టింది. విశాల నాన్నగార్ని గురించి తెలుసుకోవాలన్న కుతూహలం నాలో బాగా పనిచేస్తోంది.

"విశాలా, నాన్నగారు కులాసాగా ఉన్నారా?" అని అడిగాను.

"లేనండీ, నాన్నగార్కి మూడురోజులయింది ఒంట్లో బాగులేదు. గుండెనొప్పి. ఇంటిదగ్గరే ఉన్నారు ఆఫీసుకి వెళ్ళలేదు"

"నాన్నగార్ని నే నొకసారి వచ్చి చూసేదా?"

"నిజంగా వస్తారా?"

"పద విశాలా!"

విశాల చెంగున ఒక్క పరుగున దిగువకి వెళ్ళి అందరికీ వినబడేలాగ కేక వేసింది:

"నాన్నగారూ, మిమ్మల్ని చూడడానికి ఆ కొంపమీద ఉన్నాయన వస్తున్నారు!"

"మీరేనా ఆ పైన ఉంటున్నారు. కూచోండి!" అన్నారు విశాల నాన్నగారు. ముమ్మూర్తులా విశాలనాన్నగారి పోలికే. ఆ కళ్లు ఆయనముఖానికి ఒకవిధమైన గంభీరత చేకూర్చితే విశాలముఖానికి అందాన్ని తోడుగుతున్నాయి.

మూడు రోజులుగా జబ్బుతో ఉన్నా ఏమంటూ; చూకూ లేదు. చూసేవాళ్లూ, చేసే వాళ్లూ ఎవరూ లేరు. భార్య, ఒక్క కుమార్తె అతను.

ఏకాకిజీవితం ఈడుస్తున్నాడు. నేను పోయి డాక్టర్నిచూసి మందు తెచ్చాను. పండ్లు కొన్నాను. పదిరోజులకల్లా విశాల నాన్నగారు మళ్లీ ఉద్యోగంలోకి వెళ్తున్నారు.

ఈసారి మా మైత్రి ఎక్కువయింది. నాన్నగారి అనుమతి లేకుండా నే మా షైర్లు, సినిమాలు సాగిపోతున్నాయి. ఒక్కొక్కప్పుడు ఆలస్యానికి జబాబు చెప్పకోవడం అందువల్ల నాన్నగారి ఆగ్రహానికి గురికావడం విశాలకి అలవాటయిపోయింది.

ఒకరాత్రి సినిమా చూసి వచ్చేటప్పటికి రాత్రి 10 గంటలయింది. విశాలను వాళ్ళ ఇంటిదగ్గర దిగవిడిచి నేను హోటల్ కి వెళ్లేసరికి అయ్యారు అన్నం లేదన్నాడు. కొస్త మజ్జిగయినా ఉంటే ఇమ్మని ఆ రాత్రి దానితోనే సంతృప్తిచెంది, నిద్ర పోదామని నేను నిశ్చయించుకుని గది తలుపు గడియ పెట్టబోయాను. గుమ్మంలో విశాల నాన్నగారు. నా కీరాత్రి పరీక్షలాగుంది. అయ్యారు అన్నం లేదన్నాడు. ఇప్పుడు విశాల నాన్నగారు ఏమన్నా అనేసి పోతారు. ఎలాగ ఈ కష్టాన్ని దాడటం.

"మీ రీ పని చెయ్యడం ఏమీ బాగు లేదు."

నాభయం నిజమయింది. ఇవాళతో నేను విశాల కలిసి సినిమాలకి వెళ్లడం ఆఖరు.

"పాప, మిమ్మల్ని పిలుచుకొని రమ్మంది"

"ఏమయింది, ఇంతలో!"

"ఏమీ లేదు. మీరు ఏమీ తినకుండా పడుకుంటున్నారని తెలిసి తనుకూడా ఏమీ తిననంటూంది!"

"నే నేమీ తినలేదని ఎవరు చెప్పారు?"

"నేనెరుగుదును. అయ్యార్ని మీరు మజ్జిగయినా ఉంటే ఇమ్మని అడిగినప్పుడు నే నక్కడే ఉన్నాను." ఇక అబద్ధం చెప్పి తప్పించుకోలేను.

"మజ్జిగ తాగాను. కడుపు నిండుగా ఉంది. ఇంక నాకేమీ అక్కర్లేదు, నిద్రపోతాను."

"పోనీ మాకోసం కాకపోయినా పాప కోసమయినా..."

ఎలా వెళ్లకుండాఉండగలను.

"ఆయన ఇచ్చినవన్నీ కడుపెక్క తిని ఇలాటప్పుడు ఆయన కేమీ పెట్టకుండా ను వొక్కత్తెవు తినడం ఏమయినా బాగుందే పాపా!" అంటూ విశాలనాన్న గారు ఇంట్లోకి వెళ్లి విశాల పక్కనే ఒక కంచం వేయించారు.

"వేళకాని వేళలో ఆయన్ని పిలుచుకొచ్చారు; ఏమి పెట్టడానికి. నాకు సిగ్గేస్తోంది" అన్నారు విశాల అమ్మగారు విశాలకంచంలోనివే నాలుగు పూరీలు నాకంచంలో పెడుతూ.

"వేళకాని వేళలో వచ్చి తినడానికి నాకు సిగ్గేస్తోంది" అన్నాను నేను.

"సిగ్గుపడడానికి ఇది అత్తవారి ఇల్లు కాదు లెండి. కానివ్వండి త్వరగా!" అన్నారు విశాలనాన్నగారు.

విశాలాక్షివాళ్ల కుటుంబంతో నాకు విశేషమైన మైత్రి ఏర్పడింది. మా ఆటలకి, పాటలకి అంతులేదనిపించింది. కాని మా ఆటలు పాటలు కట్టుమాయ

ఆఫీసుకు ఇంతదూరంనుంచి రోజూ నడిచివెళ్లడం తన ఆరోగ్యానికి సరి పడ లేదని విశాలనాన్నగారు ఆఫీసుకి దగ్గరగా కొత్తగా నిర్మించిన "క్వార్టర్సు"లోకి పోయి ప్రవేశించాలని నిశ్చయించారు. ఈ సోమవారమే ఇల్లు మార్చుతారు. నిజమే నాలుగుమైళ్లదూరం రోజూ వెళ్లడం రావడం చాలా కష్టం. అందులో గుండెనొప్పి గల విశాలనాన్నగార్కి అది మంచిది కాదు. అక్కడికి వెళ్లడం అన్నివిధాలా శ్రేయస్కరం. ఇక్కడకన్న నయమే కావచ్చు. ఇరుగు పొరుగున ఉండేవాళ్లు తోటి ఆఫీసు ఉద్యోగులేగనుక వాళ్ల సహకారం లభించవచ్చు. అన్ని విధాలా బాగా వుంది. కాని విశాలకి మాత్రం ఈ ఆలోచన ఎంత మాత్రము ఇష్టంకాదు. నేనుకూడా వచ్చి వాళ్ల ఇంటిలోనే ఉంటేనో! వాళ్ల మామయ్యఅనో, బాబయ్యఅనో నాన్నగారు చెప్పలేరా? కాని నాకు ఆఫీసు దూరం అవుతుంది. అయితేనేం? ఏమా, నాన్నగార్కి గుండెనొప్పి రాలేదూ? అలాగే. అయితే అలాగెందుకు అవుతుంది. పోనీ నేను వాళ్ల ఇంటికి రోజూ వస్తూంటేనో, అదీ అసాధ్యమేమో?

"మీరు మాత్రం రోజూ మాయింటికి తప్పకుండా రావాలి, రావాలి సుమండీ." అని విశాల నాతో రోజల్లా చెప్పింది.

"తప్పకుండా వస్తాను" అన్నాను.

కాని చెప్పినట్టు చెయ్యవద్దూ? విశాల నాన్నగారు ఇల్లు మార్చి అప్పడే పదిరోజులయింది. ఇంతవరకు నాకు వారి కొత్త ఇంటికి వెళదామంటే వీలుకాలేదు.

ఇల్లు ఫలానాచోట అని తెలుసు కాని ఆ ఫలానాచోటు ఎక్కడో నాకు తెలీదు. ఎవరేనా తెలిసిన స్నేహితుడు వస్తే కలిసి వెళదాం అని చూస్తున్నాను. ఇంతలో విశాల నాన్నగారికోసం వెతుక్కుంటూ వాళ్ళ బంధువులబ్బాయే ఒకరు వచ్చాడు.


## నెరసిన వెంట్రుకల ఔషధము

రంగు పూయనక్కరలేదు. ఆయుర్వేద చికిత్స తెల్లనిరంగును మార్చి శాశ్వతముగా వెంట్రుకలకు నలుపు నిచ్చును. గుణం కానిచో, డబ్బు వాపసు చేయబడును. తెలుపు కొంచెమై యుండిన రు. 2-8-0. 3 ఒకేసారి రు. 6-8-0. మధ్యరకమై యుండిన, రు. 3-8-0, 3 సీసాలు ఒకేసారి రు. 9. పూర్తిగాయుండిన రు. 5/- 3 ఒకేసారి రు. 12/-

VIJOY LABORATORIES No. 14

P. O Manoharpur (Singhbhum)

విశాలకోసం వాళ్ల నాన్నగారు జుంకాలు పురమాయించారుట. అవి తీసుకొని ఆ అబ్బాయి వచ్చాడు. ఫలానాచోట ఉంటున్నారు వస్తే కలిసి వెళదాం అన్నాను. ఆయన సరే అన్నాడు. సాయంకాలం చీకటి చినుకు. నడిచి వెళ్లాం నాలుగు మైళ్లున్నా.

పోలీసు లైన్లలాగ నిర్మించిన ఇళ్లవరసలు. ఇందులో ఏ వరసలో ఏ యింటిలో ఉంటున్నారో విశాలనాన్నగారు. మాకు తెలియదు.

ఒకవరస చివర్ని నిలబడి అక్కడ కనబడ్డ ఒకాయన్ని ప్రశ్నిస్తున్నాను. గాలిలో నామాటలు ఎంత వేగంగా ప్రయాణం చేశాయో అంతకి రెట్టింపు వేగంతో నన్ను పిలుస్తూ ఆ చీకట్లో విశాల పరుగెత్తివచ్చి, నాకంఠాన్ని తన చేతులతో పెనవైచి గట్టిగా నన్ను హత్తుకుంది

"మీవన్నీ అబద్ధాలే! రోజూ తప్పకుండా వస్తానని చెప్పి పదిరోజులయింది రాకపోయారే! మీకిది ధర్మంగా ఉందా చెప్పండి?" అటూంది విశాల.

"ధర్మాధర్మాలు తరువాత విచారించవచ్చుగానీ, మొదట నీకోసం ఏమిటి తెచ్చానో చూడకూడదూ?" అంటున్నాడు వాళ్ల బంధువులబ్బాయి.

"ఈయన్ని తీసుకొచ్చావు నాకు అంతే చాలు అంది" విశాల.

"ఏమిటే, మామీద దయగలిగిందా మీకు యిలా వచ్చారు" అని నవ్వుతూ వచ్చారు విశాల నాన్నగారు.

"మీవాళ్ల అబ్బాయి విశాలకోసం మీరు చేయించమన్న జుంకాలు తెచ్చాడు. ఆయనకి దారి చూపుదామని నేనువచ్చాను:' అన్నాను.

"ఏవీ, ఏవీ చూద్దాం. ఇంతసేపయి చెప్పలేదేం?" అంటూంది విశాల.

"ఇంత సేపయి నేను చెప్తున్న దేమన్నా నువ్వు వింటేనా?" అంటున్నారు ఆయన.

"ఇదొక కారణం దొరికింది మీకు. మేము అదృష్టవంతుల మయాం. పాప ముఖంమీద నవ్వు చూడలేదు ఈ పది రోజులూ. తిండి ముట్టుకోదు. నిద్రపోదు. ఎప్పుడూ ఏదో ఆలోచనే - పాపం మీకోసం-

"ఊఁ. ఈయనకోసం రమ్మని!" అంటూంది విశాల.

పిచ్చిపిల్ల నాకోసం ఇంత బాధపడిందా అనుకున్నాను నేను.

ఇక విశాల కట్టతెగిన ప్రవాహంలాగ ఒకటే కబుర్లు. గుక్క తిప్పుకోకుండా ఈ పదిరోజుల్లో జరిగిన సంగతులన్నీ ఏకరువు పెట్టింది కొత్తచోటు, కొత్త మనుష్యులు, కొత్తకొత్త స్నేహితులు, కొత్త కొత్త ఆటలు, పాటలు అన్నీ బాగానే ఉన్నాయిగానీ నేను రాకపోవడం తన కెంత కష్టంగా ఉండెను.

ఇంత నిర్దయుణ్ణి నన్ను తగ్గట్టు దండించింది. ఆరాత్రి నిద్రపోయేసరికి రెండుగంటలయింది.

ప్రతి శనివారం సాయంకాలం నేను వాళ్ళింటికి రావాలి. ఆరాత్రి, ఆదివారమల్లా అక్కడే వుండి సోమవారం ఉదయం అక్కడ్నుంచే బయలుదేరి ఆఫీసుకి వెళ్ళాలి. ఇది విశాల చేసిన శాసనం. దీనిలో ఒక్క అక్షరమయినా తప్పడానికి నాకు అధికారం లేదు.

ఈ రెండురోజులూ నన్ను ఎవరూ, ఏపనిమీదాఆపి మాటాడడానికి విశాల అంగీకరించదు. అనవసరమైన పనులు ఆదివారం నాడు చెయ్యకూడదు. అందవికారమైన వాళ్లను ఆరోజున చూడకూడదు. అర్థంలేని మాటలు ఆడకూడదు. వినకూడదు. విశాల స్వయంగా వండిపెట్టేది

మధ్యాహ్నం మామిడితోటలో, మామిడి చెట్లనీడల్లో, మామిడి పువ్వుల మత్తువాసనల్లో, మామిడిపిందెల దాగుడుమూతల్లో మా హృదయంలో దాగిఉన్న భావాలు స్వేచ్ఛగా బయటికి వచ్చి సంచారం చేస్తాయి.

ఇటువంటి సమయంలో విశాలకు అతీతమైన విజ్ఞానోదయం కల్గుతుంది. నా చెయ్యి చూసి జాతకం చెప్తుంది.

"చాలా అదృష్ట జాతకం! పదిమంది పిల్లలు!"

"నా కేమీ అభ్యంతరం లేదు. నీ యిష్టమే!" అని నేను.

"అమ్మా చూడవే, ఈయనెలా అంటున్నారో!" అని అమ్మకి రిపోర్టు చేస్తుంది విశాల.

"అన్నంతమాత్రాన ఏమయిందిలే? ఆయన నిన్ను పెళ్లిచేసుకున్నప్పుడు కదా నీ యిష్టం?" అంది ఆవిడ.

"నా కొద్దు బాబోయ్. ఇటువంటి వాళ్లతో పెళ్లి. వీళ్లు పెద్దపెద్ద కట్నాలు తెచ్చిపెట్టమంటే మా నాన్నగారు ఎక్కడ్నుంచి తేగలరు? నేను పెళ్లిచేసుకోదలుస్తే మా అత్తకొడుకు సుబ్బారావు ఉన్నాడు, వాణ్ణి చేసుకుంటాను. ఇంతకన్న మంచిది"

విశాల నా ప్రేమని విలువకట్టూంది. బాహుశా ఇది పెళ్లిగా పరిణమిస్తే నా ప్రేమ ఎన్నివేల రూపాయలు కోరుతుందో అని అంచనా వేస్తోంది విశాల. నిత్యంజరుగుతూండే పెళ్లిళ్లలోని ఆచారాల్ని చూసి. అమాయకురాలు నాన్నగారి మేలుకోసం ఎంతత్యాగం చెయ్యడానికి వీలవుతుందో చూస్తోంది.

మధ్యాహ్నం మామిడితోటలోకి లాక్కెళ్లిందివిశాల. ఒకచెట్టునున్న మామిడిపిందెలు గుత్తులుగా కోసి తీసుకురమ్మంది. చెట్టు ఎక్కగానే చేతికందిన నాలుగు పిందెల గుత్తికోసి ఇచ్చాను. పుచ్చుకొన్న వెంటనే అందులో ఒక పిందె తెంపి, ముక్కలుచేసి తినబోయింది. తినలేక ముక్కల్ని పారేసింది. మిగిలిన మూడుపళ్లతో గుత్తిని ఇంటికి తెచ్చి గోడకి తగిలిస్తూ నేను అన్నాను.

"విశాలా, ఆ గుత్తిలోని పిందెలు మరి తియ్యకు. ఇవి మా ఇంటికి అలంకారంగా ఉన్నాయి. నువ్వూ, మీ అమ్మా మీ నాన్నగారు ఈ మామిడి పిందెలగుత్తిలా కలిసిఉన్నారు"

"అయ్యో, ఎంతపొరపాటయింది. ఆ నాలుగో పిందెకూడా వుంటేఎంత బాగుండేది. అదివుంటే మీరుకూడా మా యింట్లో కలిసి ఉన్నట్టు ఉండేదికదూ? నిష్కారణంగా తెంచేశాను?"

"విచారించ నక్కర్లేదు విశాలా! నాలుగేసి పిందెల గుత్తులు ఇంకెన్నిలేవు? ఇది కాకుంటే ఇంకొక్కటి!"

"ఒక్కటే ఎలాగవుతుంది? ఆ గుత్తిలో మీరు లేరండే.

"దానికి మన మేం చెయ్యగలం? త్రుంచగలంగాని మళ్లీ రచించలేము!"

ఈమాటలు విశాలకు బోధపడి వుండకపోవచ్చు.

నాకుమాత్రం బోధపడింది. స్పష్టంగా మరి రెండురోజుల్లో మామిడి పిందెలగుత్తిలోని నాలుగో మామిడిపిందెవలె నేను నిష్క్రమించవలసిన సమయం వచ్చిందని. కాని దీనికి కారణం ఎంతకఠోరమయినది? ఇది విధి నిర్ణయమా? మనుష్యులలోని అసూయ విషజ్వాలల ఫలితమా? ఇప్పటికీ చెప్పలేను!

విశాలను వెతుక్కుంటూ నేను పెరటి గుమ్మంలోకి వెళ్లేసరికి ఆగోడకి అంటించి ఉన్న కాగితం నాకంటబడింది. నా కళ్లను నేను నమ్మలేకపోయాను.

నా హృదయంలో భారం నన్ను క్రుంగదీసింది. నా జ్ఞానం నన్ను విడిచిపెట్టింది. భూమి తిరుగుతున్నట్టు నాకు బోధపడింది.

(30-వ పేజీ చూడండి)

# దాగినద్వేషం

(23-వ పేజీ తరవాయి)

షావుకారు పన్నిన కుట్ర ఒకటుందిగా. ఇది బయట పెడితే, అది అతను బయట పెట్టాను."

"అందులో అతనికీ చెయ్యి ఉందంటున్నారుగా."

"ఉంది. కాని ఉందని ఎవరు నిరూపించగలరు?"

"రామనాథం ఈ పని చేసి వుండకూడదూ?"

"చేసిన వాడయితే ఆ రాత్రి తనచెల్లెలు శంకరాజింటికి వెళ్లిందని మొన్నటి రోజున పోలీసులికి ఎందుకు చెప్తాడు? చెప్పనందువల్ల తనచెల్లెలికి పైసా దక్కదని అతనికి తెలుసు. అదీకాక ఆ కత్తి ఎక్కడవున్నదీ అతని కెలా తెలుసు? నువ్వు నిద్రలో లేచి తిరుగుతున్నట్టుకూడా అతనికిగాని, సత్యనారాయణకిగాని తెలియదు. పార్వతమ్మగారి కైనా నువ్వు నిద్రలో లేచి తిరుగుతున్న సంగతే తెలుసును కాని, తాళం చెవులు పూలకుండు కింద పెడుతున్న సంగతి తెలియదు. లేక నువ్వెప్పుడైనా చెప్పిఉన్నావా? రామచంద్రరావు చెప్పివుంటాడా?"

"లేదు. అత్తకి తెలియదు. అతను చెప్పలేదు"

"చెప్పలేదని నీకెలా తెలుసు?"

"అత్తకి చెప్పివున్నట్లయితే ఆరాత్రి ఆమె అంతభయపడేదికాదు. నా గదిలో పడుకోటానికి కూడా సిద్ధపడింది. కాని చివరకి అన్నతో కలిసి ముందు గదిలో పడుకుంది."

"అదీ అతనిసలహాపైనే కాదూ?"

కమల జవాబు చెప్పలేక పోయింది. కాని అది అవసరం లేకపోయింది. ఇంతకాలమూ అతని సహాయం పైనేనా తాను ధైర్యం చిక్కబట్టి రోజులు గడుపుతున్నది! ఈ తలపుతో కమలకి బ్రతుకంతా అంధకారమయమై పోయింది. ఆ పాదమస్తకం కంపించిపోయింది.

మాధవరావు ఆప్యాయంగా ఆమె వెన్ను తట్టాడు.

"ఫరవాలేదులే. విశ్రాంతి తీసుకో. మీ మామయ్య ఈ రాత్రి స్వేచ్ఛగా మీ యింట్లో తిరుగుతున్నాడు - నిద్రలో కాదు, నీకోసం నిరీక్షిస్తున్నాడు ఆయనకి ధైర్యంచెప్పడానికి నువ్వే మిగిలావ్. వెళ్లు."

కాని కమలకి కాళ్లాడలేదు. ఇంతలో ఇంటిముందు జట్కా ఆగిన చప్పుడయింది. ఒక యువకుడు చేతిలో తోలుబాగ్‌తో వచ్చాడు. మాధవరావు ఆహ్వానిస్తూ "రావోయ్. ఎక్స్‌ప్రెస్ ఈ పూట ఆలస్యమయింది కాబోలు నువ్వు వచ్చేసరికే ఇక్కడ పనంతా పూర్తయింది. పత్రాలతో నిమిత్తం లేకుండా అన్నీ పరిష్కారమైనాయి. రేపే మన ప్రయాణం. ఈ అమ్మాయిని నువ్వు చూశావుగా. మామా మేనగోడలూ నిరాధారంగా ఉన్నారు. ఉండగలిగితే రేపు నువ్విక్కడే ఉండిపో."

జూనియర్ వకీలురంగారావు తెల్లబోయి చూశాడు.

ప్రాసిక్యూటర్ గుజ్జు ఆగిపోయింది. కళ్లు నులుముకు "మళ్లీ ఏంకథ?" అన్నట్లు చూశాడు. [సమాప్తం]

---

# విశాలాక్షి

(20-వ పేజీ తరువాయి)

ఆ కాగితంమీద రెండుపంక్తులు. నా కళ్లను పడ్డాయి. ఈ నాటికి ఆసూదులు పూడదీయడానికి వీలుగాకుండా గ్రుచ్చుకున్నాయి. విశాలనాన్నగారి పేర, విశాలఅమ్మగారు నేను కంటబడగానే ఉత్సాహంగా ఉంటుంది. అనే సూచనఉంది అందులో.

ఏదయితే చూడకూడదో, ఏదయితే వినకూడదో, ఏదయితే చెప్పకూడదో నా కది ఎదురయింది. ఎలాగ ఇప్పుడు? ఏంచెయ్యను విశాల, విశాలనాన్నగారు ఈ మాట తెలుస్తే- లోకులు చేసిన ఈఇంద్రజాలం ఆయన కంట పడితే- అప్పుడే పడిందేమో! నన్నాయన మళ్లీచూస్తే- నేను ప్రాణాలతో నయినా బయటపడగల్గుతే- ఆయన్ని అంత సౌమ్యుణ్ణి—ఎంత గాయపడ్డాడో! ఎలాగ?

విశాల అమ్మగారుకూడా అక్కడే ఉన్నారు.

"ఈ కాగితంమీద ఒక బిందెడు నీళ్లు పొయ్యండి." అన్నాను. లేకుంటే అందులోని విషజ్వాల ఎందర్ని భస్మం చేస్తుందో అన్నభయంతో.

ఆమె గబగబా నిప్పును ఆర్పినట్టుగా ఆ కాగితం మీద నీళ్లుపోసింది ముక్కలు ముక్కలుగాచేసి దాన్ని మట్టిలో వేసి కాలరాచాను.

విశాలతో నా పరిచయంకూడా ఈ కాగితం ముక్కలవలెనే ముక్కలయి కాలగర్భంలో కలిసిపోయింది.

విశాల నాన్నగారు సికింద్రాబాదు బదిలీ కోరారు, ఆరోగ్యకారణాలమీద. రెండు రోజులలో సిద్ధంగా ఉండాలి ప్రయాణానికి. ప్రయాణానికి సన్నాహాలు చేస్తున్నారు. నాకు తోచిన సహాయం నేనకూడా చేశాను. వారిని వారిసామగ్రితో రైలెక్కించి రైలు కదిలిపోయేవరకు ఉండి కదిలిపోతున్న రైలులో వారికి చెంబుతో మంచినీళ్లు అందించి నేను వెనక్కి నిలిచిపోయాను. అప్పుడు నా కనరయినా మంచినీళ్లు ఇస్తే బాగుండునని పించింది.

విశాలమాత్రం అంటూంది. "మీ రు సికింద్రాబాదు రావాలి సుమండీ!" అని. నా కళ్ల ఎదుట పిందె తెగిపోయిన మామిడి పిందెల గుత్తి కనబడుతున్నది.

ఏడాదికిందట విశాల ఎవరో నాకు తెలీదు. ఏడాదిపాటు ఎవరికోనూ ఏ పరిచయమూ లేకుండా నేను హాయిగా ఉన్నాను. ఈ విశాల నాజీవితంలో ఎంత ఆశ్చర్యకరంగా ప్రవేశించిందో అంత ఆశ్చర్యకరంగా నిష్క్రమించింది. విశాలాక్షి విశాలమయిన కళ్లుగల విశాలాక్షి. పదకొండేళ్లయినా నిండని అంత చిన్నపిల్ల తన చేతి చిటికెన వేలితో నన్ను నాఆశల్లోంచి, ఆశయాల్లోంచి, ప్రేమల్లోంచి, ప్రణయాల్లోంచి, ఆనందతరంగాలమీంచి తేలించుకొనిపోయిన దేవతవలె అవతరించింది. తన విశాలమయిన నయనాల్లో నన్ను ఉయ్యాల లూగించింది.

---


## కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటీచికిత్స, క్యాటలాగు ఉచితం.

జి. వి. రెడ్డి అండ్ కో,, "భాస్కరాశ్రమము", గోపాలపురం, తూర్పు గోదావరిజిల్లా.